

## 'బీడీ కార్మికులకు వేతనం పెంచాలి'

దోమకొండ, ఏప్రిల్ 22: బీడీ కంపెనీలలో పనిచేసే కార్మికులకు వేతనం పెంచాలని నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి శివంది సత్యం అన్నారు. సోమవారం దోమకొండలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీడీ కంపనీలలో పని చేస్తున్న 7లక్షల మంది బీడీ కార్మికుల వేతన ఒప్పందం ముగిసినందున బీడీలు చుట్టే కార్మికులకు వెయ్యి బీడీ తయారీకి ప్రస్తుత వేతనంపై 40 శాతం కూలీ పెంచాలన్నారు. ప్యాకర్‌లకు రూ. 6 వేలు పెంచి, నెలసరి ఉద్యోగులకు రూ.3 వేలు పెంచాలని కోరుతూ బీడీ కంపనీల యాజమాన్య సంఘ ప్రతినిధులకు వినతిపత్రం అందజేశామన్నారు.



# కామారెడ్డియే.. కీలకం!

» జహీరాబాద్ ఎంపీ ఎన్నికల్లో కీలకం కానున్న కామారెడ్డి జిల్లా
» ఎంపీ పరిధిలోకి జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు
» సంగారెడ్డి జిల్లాలో మూడు నియోజకవర్గాలు మాత్రమే..
» జహీరాబాద్ ఎంపీ గెలుపును నిర్దేశించనున్న జిల్లా
» కామారెడ్డి జిల్లాలో మొత్తం ఓటర్లు 8.74 లక్షలకు పైగానే..
» ఇందులో మహిళా ఓటర్లు 4.52 లక్షలు
» ఎంపీ అభ్యర్థుల గెలుపోటముల భవితవ్యం జిల్లా ఓటర్లపైనే..
» ఎంపీ ఎన్నికల్లో జిల్లాపైనే దృష్టిపెట్టిన ప్రధాన రాజకీయ పార్టీలు

కామారెడ్డి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఈ లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీ స్థానం నుంచి పోటీ చేసే అభ్యర్థులకు గాని, పార్టీలకు గాని కామారెడ్డి జిల్లానే కీలకం కానుంది. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గెలుపును కామారెడ్డి జిల్లానే నిర్దేశించనుంది. ఈ ఎంపీ స్థానం పరిధిలోకి కామారెడ్డి జిల్లా నుంచి నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు రానున్నాయి. సంగారెడ్డి జిల్లా నుంచి మూడు నియోజకవర్గాలు మాత్రమే వస్తాయి. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు చెందిన ఓటర్లే జహీరాబాద్ ఎంపీ అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్నారు. కామారెడ్డి జిల్లాలో మొత్తం ఓటర్లు 8.74 లక్షలకు పైగానే ఉన్నారు. అయితే, ఇందులో మహిళా ఓటర్లు అధికంగా ఉండటం గమనార్హం. అంతేకాకుండా జహీరాబాద్ ఎంపీ ఎన్నికలకు కామారెడ్డి జిల్లానే కీలకం కావడంతో ప్రధాన పార్టీలతో పాటు పోటీ చేసే అభ్యర్థులు సైతం జిల్లా ఓటర్లపై దృష్టి సారించారు. కామారెడ్డి జిల్లాకేంద్రంగా చేసుకొని బరిలో ఉండే అభ్యర్థులు గాని, పార్టీలు గాని ప్రచారం చేపడుతున్నాయి.

### జహీరాబాద్ పరిధిలోకి రెండు జిల్లాలు

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి సంగారెడ్డి జిల్లాతో పాటు కామారెడ్డి జిల్లా రానుంది. పది సంవత్సరాల క్రితం జిల్లాల పునర్విభజనను అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టింది. దీంతో కామారెడ్డి నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలతో కలిసి కొత్త జిల్లాగా ఏర్పడింది. త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికలకు కామారెడ్డి జిల్లా జహీరాబాద్ ఎంపీ పరిధిలో ఉంది. సంగారెడ్డి జిల్లా పరిధిలోకి జహీరాబాద్ ఎంపీ నియోజకవర్గం రానున్నందున ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా సంగారెడ్డి కలెక్టరే వ్యవహరిస్తున్నారు. జహీరాబాద్ ఎంపీ నియోజకవర్గం పరిధిలోకి కామారెడ్డి జిల్లాలోని మొత్తం నాలుగు నియోజకవర్గాలు వస్తాయి. కామారెడ్డి నియోజకవర్గంతో పాటు ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడలు జహీరాబాద్ ఎంపీ పరిధిలోనే ఉండనున్నాయి. వీటితో పాటు సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, ఆందోల్, నారయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గాలు రానున్నాయి. ఈ లెక్కన జహీరాబాద్ ఎంపీ పరిధిలోకి మెజార్టీ అసెంబ్లీ నియోజకవర్గాలు కామారెడ్డి జిల్లాలోనే ఉండటం విశేషం.

### ఎంపీ అభ్యర్థుల గెలుపునకు జిల్లా ఓట్లే కీలకం

లోక్ సభ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీ స్థానం నుంచి పోటీ చేసే అభ్యర్థుల గెలుపోటములకు కామారెడ్డి జిల్లా ఓటర్లే కీలకం కానున్నారు. ఈ ఎంపీ నియోజకవర్గం పరిధిలోని సంగారెడ్డి జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల కంటే మెజార్టీ ఓట్లు కామారెడ్డి జిల్లాలోనే ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 8.74 లక్షలకు పైగానే ఓటర్లు ఉన్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాలను కలుపుకొని మొత్తం ఓట్లు 8,74,065 ఓట్లు ఉన్నా యి. ఇందులో మహిళల ఓట్లు 4,52,465 ఉండగా.. పురుషుల ఓట్లు 4,21,561 ఉన్నాయి. ఇతరుల ఓట్లు 39 ఉన్నాయి. ఈ ఓట్లలోను మహిళ ఓట్లే అధికంగా ఉండటంతో వారి ఓట్లే కీలకం కానున్నాయి. అదేవిధంగా అన్ని నియోజక వర్గాల్లోనూ మహిళల ఓట్లే అధికంగా ఉన్నాయి.

### కామారెడ్డి ఓటర్లే అధికం

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి ఇటీవల ఎన్నికల అధికారులు నోటిఫికేషన్‌ను జారీ చేశారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే ఓటర్ జాబితాను సిద్ధం చేశారు. జహీరాబాద్ ఎంపీ నియోజకవర్గం పరిధిలోకి మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు రానున్నాయి. ఇందులో మెజార్టీ నాలుగు నియోజకవర్గాలు కామారెడ్డి జిల్లా పరిధిలోనివే. జిల్లాలో మొత్తం 8.74 లక్షలకు పైగా ఓట్లు ఉన్నాయి. ఈ ఎంపీ నియోజకవర్గంలోని కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలోనే అత్యధిక ఓట్లు ఉండటం విశేషం.

కామారెడ్డి నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,54,271 ఉన్నాయి. ఇందులో పురుషుల ఓట్లు 1,22,238 కాగా.. మహిళల ఓట్లు 1,32,013, ఇతరుల ఓట్లు 20 ఉన్నాయి. ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,21,730 ఉండగా.. పురుషుల ఓట్లు 1,06,373 కాగా.. మహిళల ఓట్లు 1,15,355, ఇతరుల ఓట్లు రెండు ఉన్నాయి. జుక్కల్ నియోజకవర్గంలో ఓట్లు 2,01,935 ఉండగా పురుషుల ఓట్లు 99,113 కాగా, మహిళల ఓట్లు 1,02,813, ఇతరుల ఓట్లు తొమ్మిది ఉన్నాయి. బాన్సువాడలో ఓట్లు 1,96,129 ఉన్నాయి. ఇందులో పురుషుల ఓట్లు 93,837 కాగా, మహిళల ఓట్లు 1,02,284, ఇతరుల ఓట్లు ఎనిమిది ఉన్నాయి.

### జిల్లాపైనే దృష్టి పెట్టిన ప్రధాన పార్టీలు

ఈ లోక్‌సభ ఎన్నికలను జిల్లాలోని ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్, బీజేపీలు మెజార్టీ ఎంపీ స్థానాలకు కైవసం చేసుకోవడానికి దూకుడుగా ముందుకు పోతున్నాయి. జహీరాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలోకి సంగారెడ్డి జిల్లా నుంచి మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. కామారెడ్డి జిల్లాలో మెజార్టీ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండటంతో కామారెడ్డి జిల్లా కీలకం కానుంది. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలు జహీరాబాద్ ఎంపీ ఎన్నికలపై కామారెడ్డి జిల్లా పైనే దృష్టి సారించాయి. జహీరాబాద్ ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకోవాలంటే కామారెడ్డి జిల్లా ఓట్లను కొల్లగొడితే గెలుపు సునయాసం అవుతుందని పార్టీలతో పాటు బరిలో ఉండే ఆశావహులు సైతం లెక్కలు వేస్తున్నారు. ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ ఎంపీ స్థానంపై గురి పెట్టింది. ఈ ఎంపీ నియోజకవర్గం పరిధిలోని ముగ్గురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే కావడంతో పార్టీ పరంగా బరిలో ఉండే అభ్యర్థికి మద్దతు తెలుపుతూ ప్రచారాన్ని చేపడుతున్నారు. ఇక బీఆర్ఎస్, బీజేపీలు బరిలో ఉండే అభ్యర్థులు జిల్లా ఓట్లపైనే ఆశలు పెట్టుకున్నారు. ఈ పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండడంతో పార్టీ అభ్యర్థి ఆ నియోజకవర్గాలతో పాటు మిగితా నియోజకవర్గాల్లోనూ ప్రచారం చేపడుతున్నారు. ఇక బీజేపీ నుంచి ఒక ఎమ్మెల్యే గెలువడంతో ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆ నియోజకవర్గంతో పాటు మిగితా అసెంబ్లీ నియోజకవర్గంల్లోనూ సభలు, సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా జహీరాబాద్ ఎంపీగా బరిలో ఉండే అభ్యర్థులు కామారెడ్డి జిల్లాపైనే దృష్టి పెడుతున్నారు.



## సంక్షిప్త సమాచారం



మద్నూర్‌లో ముస్తాబైన ఆలయం

### హనుమాన్ జయంతికి ఆలయాల ముస్తాబు

మద్నూర్, ఏప్రిల్ 22: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో హనుమాన్ ఆలయాలు ముస్తాబయ్యాయి. రంగులతో పాటు విద్యుత్ దీపాల కాంతుల్లో ఆలయాలను ఎంతో సుందరంగా ముస్తాబు చేశారు. హనుమాన్ జయంతిని గ్రామ గ్రామాన ఘనంగా జరుపుకుంటామని భక్తులు తెలిపారు. దీనిలో భాగంగా మండల కేంద్రంతో పాటు సలాబత్‌పూర్‌లోని హనుమాన్ ఆలయం, అలాగే ఆయా గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో జయంతి నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు.

### 'విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కావద్దు'

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 22: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ద్వారా మానసిక ఆరోగ్య కార్యక్రమాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శిరిష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్ పరీక్ష ఫలితాలలో విద్యార్థులు ఎవరు ఒత్తిడికి గురికావద్దని తెలిపారు. ఎవరైన తక్కువ మార్కులు వచ్చాయని నిరాశ నిస్పృహలకు లోనై విద్యార్థులు ఆత్మహత్య ప్రేరేపిత ఆలోచనలకు లోను కావొద్దని తెలిపారు. ఎవరికైనా మానసిక ఆందోళన తలెత్తితే ఉచిత టోల్‌ఫ్రీ నెం.14416ని సంప్రదించి కౌన్సెలింగ్ పొందాలని, లేదా దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిల్లో వైద్యులను సంప్రదించాలని తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థులను ఎప్పటికప్పుడు గమనిస్తూ మానసిక సమస్యలకు గురికాకుండా చూసుకోవాలని తెలిపారు.

### 'దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకోవాలి'

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 22: దివ్యాంగులు అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞాన్ వికలాంగుల సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిప్ప దుర్గాప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన మండలకేంద్రంలో మాట్లాడుతూ వచ్చేనెల 13న పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కేంద్ర ఎన్నికల కమిషన్ దివ్యాంగుల కోసం ప్రత్యేక రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు ప్రత్యేక ఏర్పాట్లతో దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టిందని తెలిపారు. మనం వేసే ఓటు మన సంక్షేమ పోరాటానికి ఆయుధంగా మారిందని తెలిపారు. ఇందులో పంగ ఈశ్వర్, గాడి నర్సింలు, నాయకులు బంటు స్వామి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధిలో.. స్వయం ఉపాధి!

- జిల్లాలో అభాసుపాలవుతున్న జాతీయ మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం
- సొంత పనులకు కూలీల వినియోగం
- గాంధారి మండలం ముదెళ్లి గ్రామంలో ఎఫ్ఏ, టీఏల నిర్వాకం
- సస్పెన్షన్ అయినా.. ఇక్కడే పోస్టింగ్



వరి పంట కోస్తున్న ఉపాధి హామీ కూలీలు(ఫైల్)



ముదెళ్లి గ్రామంలో విచారణ చేస్తున్న జిల్లా అధికారులు

గాంధారి, ఏప్రిల్ 2: గాంధారి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు స్థానికంగా ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో నెలకొల్పిన గ్రామీణ ఉపాధి పథకం కొందరు సిబ్బందితో అడ్డదారి పడుతుంది. చెరువులలో పూడికతీత, గుట్టలపైన కందకాలు తీయడం, సాగునీటి కాలువల్లో పూడిక మట్టి తీయడం వంటి పనులు ఉపాధి హామీ పనుల్లో చేపట్టాల్సి ఉండగా కొందరు సిబ్బంది సొంత పనులకు కూలీలకు వాడుకుంటున్నారు. మండలంలోని ముదెళ్లి గ్రామంలో టీఏ తమ సొంత వ్యవసాయభూముల్లో పొలాల కోతకు ఉపాధి హామీ కూలీలను వినియోగించి వారికి ప్రభుత్వ డబ్బును చెల్లిస్తు పథకాన్ని అభాసుపాలు చేస్తున్నారు.

**● కొందరు టెక్నికల్ అసిస్టెంట్‌ల నిర్వాకం**

సాధారణంగా కూలీల హాజరు మాత్రమే ఎఫ్ఏలు తీసుకుంటారు. కూలీల సంఖ్య కొలతల ఆధారంగా టీఏలు 350 ఫీట్ల వరకు కొలిచి దాని ఆధారంగా డబ్బులు వచ్చేలా చేస్తారు. అయితే కొందరు టీఏలు, ఎఫ్ఏలతో కుమ్మకై కూలీలతో కొంతమొత్తంగా మాట్లాడుకుని వ్యవసాయపనులు నిబంధనలకు విరుద్ధంగా ఎంబీ రికార్డులు చేసి డబ్బులు చెల్లిస్తున్నారు. అంతేకాకుండా సదరు గ్రామం నుంచి కొంతమొత్తంగా డబ్బులు ఇస్తేనే రూ.250పైగా కూలీలకు డబ్బులు వచ్చేలా చూస్తారు. లేదంటే వారికి సంబంధం లేకుండా రూ.100 నుంచి రూ.120 మాత్రమే ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పథకంలో చేపట్టి మెటిరియల్ రోడ్లకు సంబంధించి డ్రైవింగ్ ప్లాట్ ఫామ్‌లకు డబ్బులు ఇస్తేనే రికార్డు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా హరితహారానికి సంబంధించిన ట్యాంకర్ల పేమెంట్ విషయంలో డబ్బులు తీసుకున్న గ్రాండ్లకు మాత్రమే పెమెంట్ చెల్లిస్తున్నారని సర్వసభ్య సమావేశాల్లో ప్రజాప్రతినిధులు ఆరోపించారు.

**● సస్పెన్షన్ అయినా.. ఇక్కడే పోస్టింగ్**

మండలంలోని 15 కిలోమీటర్ల దూరంలో ల్యాండ్ డెవలప్‌మెంట్ పనులకు సంబంధించి చేయకుండానే డబ్బులు డ్రా చేసినట్లు తెలిసింది. మండలంలో పనిచేస్తు టీఏ సస్పెండ్ అయిన తిరిగి ఇదే మండలంలో పోస్టింగ్ ఇచ్చారు.టీఏకు అండదండలు ఎక్కువ ఉన్నాయని టీఏకు నచ్చితేనే పేమెంట్ చేస్తారని లేదంటే చేయరని డబ్బులు ఇస్తేనే ట్యాంకర్ మెటీరియల్ పేమెంట్ అవుతుందని బాహటంగా చెబుతున్నారు.

**● జిల్లా అధికారికే బెదిరింపు ఉత్తరాలు**

అయితే, ఎన్నికల సమయంలో వేరే జిల్లాకు వెళ్లిన ఓ జిల్లాస్థాయి అధికారికి సదరు టీఏ బెదిరింపు ఉత్తరాలు రాశారని, అందుకే అతనిపై చర్యకు వెనకడుగు వేస్తున్నారని తోటి సిబ్బంది చెబుతున్నారు. టీఏ జిల్లా అధికారులను బెదిరిస్తున్నారంటే.. ఆయన ఎంత సపోర్టు ఉన్నదో? దీనిని బట్టి ఇట్టే స్పష్టమవుతుందంటున్నారు. ఇప్పటికైన అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్

### ఐదో రోజు 9 నామినేషన్ల దాఖలు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 22: జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం ఐదో రోజు మొత్తం తొమ్మిది నామినేషన్‌లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి క్రాంతి వల్లూర్ తెలిపారు. ఇందులో భాగంగా బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ 1 నామినేషన్, అలాగే స్వతంత్ర అభ్యర్థి గంగారాం 1, తెలంగాణ ప్రజాశక్తి పార్టీ కొత్త బాలబస్వరాజ్ 2, స్వతంత్ర అభ్యర్థి రమేష్ సజ్జపూర్ 1, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా మల్లెపు మోహన్‌రెడ్డి 1, స్వతంత్ర అభ్యర్థి రవి మహదేవ్‌స్వామి 2, కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ 1 నామినేషన్‌లు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.




మాట్లాడుతున్న ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిశ్రీనివాస్ రెడ్డి

### ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్ష

మద్నూర్, ఏప్రిల్ 22: జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం స్థానిక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మద్నూర్ మండల కేంద్రంలో ఆయా మండలాల తహసీల్దార్లు, అధికారులతో సమీక్షించారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాలు, సదుపాయాలు, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆయా మండలాల తహసీల్దార్లు ముజీబ్, సురేష్,వేణు, రేణుక, నాయబ్ తహసీల్దార్ భరత్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

● నిర్వాహకులను ఆదేశించిన అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 22: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని, తూకంలోఎలాంటి తేడా రాకూడదని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. సోమవారం మండలంలోని క్యాసంపల్లిలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోళ్ల ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని, తరుగుతీయరాదన, తూకం వేసిన వెంటనే ధాన్యాన్ని కేటాయించిన మిల్లులకు తరలించాలన్నారు. మిల్లు యాజమానులు కూడా హమాలీలను అధికసంఖ్యలో పెట్టుకుని లారీలు వచ్చిన వెంటనే ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకుని ట్రక్‌షీట్ అకనాలెడ్జ్మెంట్ జారీచేయాలని,తరుగు తీసిరైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని కోరారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ శరవేగంగా సాగుతుందని తెలిపారు. 350 కొనుగోళ్ల కేంద్రాల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 241 కేంద్రాల ద్వారా 11723 మంది రైతులకు చెందిన రూ.161 కోట్ల 70 లక్షల విలువ గల 73400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలో రూ.55 కోట్ల 27లక్షలు వేశామని తెలిపారు. రైతులు నష్టపోకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే బైల్డ్ రైస్‌మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరాఫరాల మేనేజర్ నిత్యానందం, డిప్యూటీ తహసీల్ధార్‌లు, తదితరులు పాల్గొన్నారు.



తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

# 'బీజేపీ పాలనలో రైతుల ఆదాయం రెట్టింపు'

పెద్దబజార్, ఏప్రిల్ 22: బీజేపీ పాలనలో రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో కిసాన్ మోర్చా రైతులతో సమస్యలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి రైతు ఎంత అవసరమో నరేంద్రమోదీ అంతే అవసరమని, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అగ్రికల్చరల్ హబ్‌గా తీర్చిదిద్దడమే అర్వింద్ ధర్మపురి లక్ష్యమని అన్నారు. రైతు వ్యతిరేకులైన బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్‌రెడ్డిని ఓడించడం కోసం రైతులందరూ కంకణం కట్టుకున్నారని అన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వంలో వరి రేటు క్వింటా రూ.1200 అయితే న రేంద్ర మోదీ వచ్చిన తర్వాత రైతులకు రూ. 1900 నుంచి రూ. 2200 వరకు క్వింటాకు పలుకుతుందన్నారు. రైతు కళ్లలో ఆనందానికి వచ్చిన రోజులని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో యూరియా, డీఏపీ కోసం రైతులు సొసైటీల ఎదుటక్యూలో నిలబడే వారని, ఇప్పుడు నరేంద్రమోదీ వచ్చిన తర్వాత ఎవరైనా గానీ రైతులు క్యూలో నిలబడే పరిస్థితి లేకుండా వచ్చిందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మోసపూరిత మాటలు నమ్మవద్దని అన్నారు. జగిత్యాలలో జీవన్‌రెడ్డి మామిడి రైతులను పట్టించుకున్న పాపానలేదన్నారు. మాజీ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ రైతుల సమస్యను పట్టించుకోక పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థిగా ఏ మొహం పెట్టుకొని నిలబడుతున్నాడని ప్రశ్నించారు. ఎంపీ అర్వింద్ పసుపు బోర్డు కోసం కేంద్రంలో పోరాడి పసుపు బోర్డు తెచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భరత్‌భూషన్, హరీష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సాయిలు (ఫైల్)

నవీపేట, ఏప్రిల్22: మండలంలోని నాగేపూర్‌కు చెందిన నేత సాయిలు (42) సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్సై యాదగిరి గౌడ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగేపూర్‌కు చెందిన నేత సాయిలు మేస్త్రీగా పనిచేస్తున్నాడు. సాయిలు తనవెంట మరో ఇద్దరు యువకులతో కలిసి బైక్‌పై నాగేపూర్ నుంచి నవీపేటకు వెళ్లారు. ఈ క్రమంలో నాగేపూర్ మూలమలుపు దాటిన కొద్దిదూరంలో రోడ్డు పక్కన ఉన్న ధాన్యం కుప్పను బైక్ ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సాయిలు అక్కడికక్కడే మృతిచెందగా బైక్‌పై ఉన్న మరో ఇద్దరు యువకులు సంఘటనస్థలం నుంచి పారిపోయారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## 'శ్రామికవర్గస్థాపన కోసం పార్టీ శ్రేణులు పోరాడాలి'

పెద్దబజార్, ఏప్రిల్ 22: శ్రామికవర్గ స్థాపన కోసం పార్టీ శ్రేణులు నిరంతరం పోరడాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లాకార్యదర్శి ఆకుల పాపయ్య పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని కోటగల్లిలో గల ఎన్ఆర్‌భవన్ ఎదుట సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ జన జాతర సక్సెస్

● రేవంత్‌రెడ్డి పర్యటనతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్



సీఎం రేవంత్‌రెడ్డితో మండవ వెంకటేశ్వర రావు మాటామంతీ

నిజామాబాద్ జిల్లాకేంద్రంలో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ 'జన జాతర' సక్సెస్ అయ్యింది. ఈ సభకు పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజక వర్గాల నుంచి నేతలు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. సభ ఆలస్యమైనా రేవంత్‌రెడ్డి కోసం గంటల తరబడి ఎండలో వేచి చూశారు. పూర్తి స్థాయిలో సభ అయ్యేంతవరకు ఉండడంతో పాటు రేవంత్‌రెడ్డి మాట్లాడే సమయంలో కార్యకర్తలంతా జోష్‌లో ఉన్నారు.

( నిజామాబాద్ అర్బన్ )



సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నాగలిని బహూకరిస్తున్న దృశ్యం



సభకు హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు



సభలో జోష్‌ను పెంచుతున్న కళాకారులు

## సీఎం సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



సీఎం బహిరంగ సభకు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

బోధన్‌రూరల్,ఏప్రిల్22: జిల్లా కేంద్రంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు బోధన్, సాలూర మండలాల నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, మందర్నా రవి, బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ అల్లె లావణ్య రమేష్, సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్‌లతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

**డిచ్‌పల్లి:** పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి పాల్గొనేందుకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు డిచ్‌పల్లి మండలం నుంచి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్ ఆధ్వర్యంలో 500మంది కార్యకర్తలను వాహనాల్లో తరలించారు. సీఎం సభకు వెళ్లిన వారిలో కంచెట్టి గంగాధర్, వాసుబాబు, షాదుల్ల, సురేందర్‌రెడ్డి, మదుసుధన్,బాలగంగాధర్, వెంకన్న, ఉన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



మోర్తాడ్‌లో కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న సునీల్‌కుమార్

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్22: మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం మోర్తాడ్‌లోని ప్రజా భవన్‌లో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో మోర్తాడ్ ఉపసర్పంచ్ సొక్కయి గంగారెడ్డి, దొన్కల్ మాజీసర్పంచ్ పర్సదేవన్న, ఉపసర్పంచ్ లింగన్న, మాజీసర్పంచ్ ముత్యాల లింగన్న, మోర్తాడ్ బీఆర్ఎస్ నాయ కులు ప్రకాష్, మోహన్, రవి, ప్రమోద్‌గౌడ్, రంగిరి, బెల్దారి మోహన్, తది తరులు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ముత్యాల సునీల్‌కుమార్ కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కాం గ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, పట్టణ అధ్యక్షుడు పుప్పాల అశోక్, జిల్లా కార్యదర్శి గిర్మాజి గోపి, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

**మోర్తాడ్:** మండలంలోని పలు గ్రామాలకు చెందిన తాజామాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం మోర్తాడ్‌లోని ప్రజాభవన్‌లో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో మోర్తాడ్ తాజామాజీ ఉపసర్పంచ్ సొక్కయి గంగారెడ్డి, దొనప్కల్ మాజీసర్పంచ్ పర్స దేవన్న, ఉపసర్పంచ్ లింగన్న, మాజీసర్పంచ్ ముత్యాల లింగన్న, మోర్తాడ్ బీఆర్ఎస్ నాయకులు ప్రకాష్, మోహన్, రవి, ప్రమోద్‌గౌడ్, రంగిరి, బెల్దారి మోహన్, తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ముత్యాల సునీల్‌కుమార్ కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, పట్టణ అధ్యక్షుడు పుప్పాల అశోక్, జిల్లా కార్యదర్శి గిర్మాజిగోపి,మహిపాల్,తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



బాల్కొండలో సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎఎస్సై

ముప్కాల్, ఏప్రిల్22: బాల్కొండ మండల కేంద్రంలో జమ మసీదు వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం గంజాయి, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్సై శంకర్ మాట్లాడుతూ గ్రామంలో యువకులు గంజాయికి అలవాటుపడి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, ఎవరైనా గంజాయి అమ్మిన, గంజాయి తాగిన సమాచారం ఇవ్వాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి సమాచారం సేకరిస్తారని వాటి ద్వారా మీ అకౌంట్ నుంచి డబ్బులు మాయం చేస్తారని, ఎవరైనా గుర్తుతెలియని వారు ఫోన్ చేస్తే సంబంధిత పోలీస్ శాఖకు సమాచారం అందించాలని అన్నారు. చిన్న పిల్లలు స్మార్ట్ ఫోన్ వాడటం వల్ల అందులో కొత్తగా యాప్ వేసుకొని సైబర్‌నేరాలకు బలి అవుతున్నారని, సెల్‌ఫోన్ ఉపయోగించకుండా చూడాలని అన్నారు. ఎవరైనా రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే 100నెంబకు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు విట్టల్, లింగన్న, సాయికుమార్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## భాషిత పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

పెర్కిట్, ఏప్రిల్22: ఆర్మూర్ పట్టణంలోని బాషిత హైస్కూల్ సోమవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నటరాజ్ పంక్షన్‌హాల్‌లో పీపీ-3 విద్యార్థులకు కిండర్ గ్రాడెన్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పట్టణ ఐఎంఏ సెక్రెటరీ డాక్టర్ రాంగిరి బాను, కోశాదికారి డాక్టర్ యు.రాకేష్‌లు పాల్గొని విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదం డ్రులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మరియమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



గోవూర్ ఆలయంలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

మోస్రా,ఏప్రిల్22: మండలంలోని గోవూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మరియమ్మ తల్లి మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు భక్తి మార్గంలో పయనించాలని అన్నారు. అనంతరం గ్రామస్థులు ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, మండల నాయకులు, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## డిచ్‌పల్లిలో ధాన్యంతో వెళ్తున్న లారీ బోల్తా

● రోడ్డుపై పడిపోయిన ధాన్యం బస్తాలు



డిచ్‌పల్లిలో బోల్తా పడిన లారీ

డిచ్‌పల్లి, ఏప్రిల్ 22: డిచ్‌పల్లి మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఎదుట నిజామాబాద్-డిచ్‌పల్లి ప్రధాన రహదారిపై వరిధాన్యం లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. 200 ధాన్యం బస్తాలు నేలపాలయ్యాయి. లారీలో ధాన్యం నిజామాబాద్ వైపు తరలిస్తుండగా డిచ్‌పల్లిలో బోల్తా పడింది. దీంతో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. మరో లారీలో కింద పడిన ధాన్యం బస్తాలను అక్కడి నుంచి తరలించి రాకపోకలకు క్లియరెన్స్ చేయించారు.

## కామ్రేడ్ లెనిన్ స్ఫూర్తితో పోరాడుదాం

బోధన్‌రూరల్,ఏప్రిల్22: అసమానతలు లేని దోపిడి రహిత సోషలిస్టు సమాజం కోసం కామ్రేడ్ లెనిన్ స్ఫూర్తితో పోరాడుతామని సీపీఎం(ఎంఎల్) ప్రజాపంథా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్ అన్నారు. సోమవారం బోధన్‌లో ప్రపంచ ప్రథమ సోషలిస్టు, విప్లవ సారధి కామ్రేడ్ లెనిన్ 154వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రామికులు, కర్షకుల కోసం విప్లవానికి నాయకత్వం వహించి ఆకలి, పేదరికం, మతం, జాతి, దోపిడి లేని సమసమాజాన్ని నిర్మించడానికి లెనిన్ అనేక పోరాటాలు చేశారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రపంచ వ్యాప్తంగా విప్లవాలకు ఆయా దేశాల రాజకీయ వ్యవస్థల మార్పుకు కారణం అయ్యాడని లెనిన్ స్ఫూర్తితో భారతదేశంలో విప్లవ సాధన కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు పడాల శంకర్, సుల్తాన్ సాయిలు, రాం, లక్ష్మణ్, ధ్యాకం పోశెట్టి, బాలాజీ, శంకర్, ఫారూఖ్, ఇమ్రాన్, షేక్.అబ్లీ, సాయిలు, శంభు, బుజ్జి, పోశెట్టి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

**సిరికొండ:** మార్క్సిస్టు మహోపాధ్యాయులు కామ్రేడ్ లెనిన్ జయంతి సందర్భంగా సీపీఐ(ఎంఎల్) 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని సిరికొండ మండల కేంద్రంలో అరుణాపతాకాన్ని ఎగురవేసి మాస్‌లైన్ నాయకులు ఉత్సవాలను ప్రారంభించుకున్నారు.ఈ సందర్భంగా మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ మహోపాధ్యాయులు కామ్రేడ్ లెనిన్‌స్ఫూర్తితో విప్లవోద్యమాన్ని నిర్మిద్దామని, బలమైన ప్రజాతంత్ర పోరాటాలను చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.శ్రమకు తగిన ఫలితం రావాలని,ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించబడాలని ఆయన అన్నారు. ఒక మనిషిని మరొక మనిషి దోపిడీ చేయని వ్యవస్థ కావాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పోరాడుతుందన్నారు. మార్క్సిస్టు మహోపాధ్యాయులు లెనిన్ జయంతిని పురస్కరించుకుని సీపీఐఎంఎల్ ఆవిర్భా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు రామకృష్ణ చెప్పారు.పెట్టుబడిదారి వ్యవస్థలో శ్రామిక వర్గం అడుగడుగున దోపిడికి, అవమానాలకు గురవుతుందన్నారు. భూర్జువ నాయకుల పాలనలో పేదలు మరింత పేదలుగా మగ్గుతున్నారని ఆయన అన్నారు. ప్రపంచంలో సామ్రాజ్యవాదం యుద్ధాలను కోరుకుంటుందని అన్నారు.పెట్టుబడుల విస్తరణలో భాగంగానే అమెరికా లాంటి అగ్రరాజ్యాలు చిన్నదేశాల మధ్య యుద్ధాన్ని అనివార్యంగా రుద్దుతుందన్నారు. సామ్రాజ్యవాదులకు వ్యవతిరేకంగా కార్మికులు,రైతులు,ఐక్యంగా పోరాడాలని రామకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.రమేష్,దామోదర్,ఈ.రమేష్,లింబాద్రి, కిషోర్,నారాగౌడ్,ఎర్రన్న, బాల్‌రెడ్డి,పండరి,అనీష్ తదితరులు పాల్గొన్నారు.



బోధన్‌లో నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**ఆర్మూర్‌టౌన్:**పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో సీపీఐ (ఎంఎల్ ) ప్రజాపంథ ఆధ్వర్యంలో సోమవారం కామ్రేడ్ లెనిన్ 154వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శ్రామికులను ఏకం చేస్తూ ప్రపంచ చరిత్రలో విప్లవకారులలో ముందు నిలిచిన కామ్రేడ్ లెనిన్ ఆశయాలను సాధించాలని వారు పోరాటం చేసిన శ్రామికవర్గం వైపు అందరు నడవాలని వారు సూచించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్)పార్టీ జెండాను ఎగురవేశారు.ఈకార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) డివిజన్ కార్యదర్శి బి.దేవరాం, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న, నాయకులు తలారి గంగాధర్, ఆకుల గంగన్న, సునీత, లక్ష్మీ, అనిల్‌కుమార్, అర్వింద్, నజీర్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## మాదిగలందరూ బీజేపీకి మద్దతుగా ఉండాలి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్22: జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలందరు బీజేపీ పార్టీకి మద్దతుగా ఉంటూ బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ షైలారం బాలు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రౌంట్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలను అణిచివేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ మాలలకు కొమ్ముకాస్తుందని దానికి నిదర్శనమే ప్రస్తుత మూడు ఎస్సీ రిజర్వుడు పార్లమెంట్ స్థానాల్లో ఒక్కటి కూడా మాదిగలకు కేటాయించలేదని అన్నారు. విద్య, ఉద్యోగ, సాంఘీక సంక్షేమ, రాజకీయ రంగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతున్న మాదిగల భవిష్యత్ మారాలంటే ఎస్సీ వర్గీకరణ ద్వారా జరుగుతుందని తెలిపారు. వర్గీకరణ సాధనలో కీలక దశకు రావడంతో బీజేపీ పార్టీ వర్గీకరణ సమస్యను పరిష్కరం దిశగా కృషి చేస్తుందని మాదిగలందరు బీజేపీకి మద్దతుగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కో ఇన్‌చార్జీ శ్యామ్‌మాదిగ, మండల అధ్యక్షుడు నాగం శ్రీనివాస్, ప్రదీప్, గొముటు పద్మ, సంకేపల్లి విప్లవ్, సందీప్, సుద్దపల్లి మార్క్, షైదం గంగాధర్, శాంతికుమార్, తరుణ్, వివిధ మండలాల, గ్రామాల ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ షైలారం బాలు

## జక్రాన్‌పల్లిలో తడిసిన ధాన్యం

జక్రాన్‌పల్లి,ఏప్రిల్22: జక్రాన్‌పల్లి మండలంలో సోమవారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. ఒక్కసారిగా మేఘాలు కమ్ముకొని ఉరుములు, మె రుపులు, ఈదురు గాలు లతో కూడిన వర్షం కురి సింది. దీంతో అన్ని గ్రామా ల్లో కల్లాల్లో, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. ధాన్యం తడకుండా తాటి పత్రిలు కప్పి ఉంచగా వీచిన భారీ ఈదురుగాలులకు తాటిపత్రులు కొట్టుకుపో యాయి. దీంతో ధాన్యం తడిసి ముద్దయ్యింది. కురిసిన అకాల వర్షంతో ధాన్యం తడిసి పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మ్యాచర్ వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే తూకం వేసి ధాన్నాన్ని రైస్‌మిల్లులకు తరలించాలని ప్రభుత్వాన్ని రైతు లు కోరుతున్నారు.



కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యం

## 'పోరాటాలతోనే ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుందాం'

సిరికొండ ఏప్రిల్ 22: నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన ఈ పదేళ్ల కాలంలో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపును తగ్గిస్తూ పథకాన్ని రద్దు చేసే చర్యలకు పూనుకుంటుందని, పథకాన్ని కాపాడుకోవడానికి మనమంత పోరాడుదామని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ కూలీలకు పిలుపునిచ్చారు.సిరికొండ మండలం రామడుగు గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలతో పథకం తీరుతెన్నులపై , చేస్తున్న పనులకు కూలీ డబ్బులు సక్రమంగా వస్తున్నాయ అని రమేష్ అడిగి తెలుసుకున్నారు. ఇచ్చేది తక్కువ కూలీ అయినప్పటికి వేసవి కాలంలో ఎలాంటి ఉపాధి లేక కుటుంబాలను పోషించుకోలేక ఉపాధి పనులకు వెళ్తున్నారని అన్నారు.నేషనల్ మొబైల్ మానిటరింగ్ సర్వీస్ పేరుతో మొబైల్ యాప్‌ను ప్రారంభించిన నేపథ్యంలోనే కార్మికులకు సమస్యలు మొదలయ్యాయన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు తగ్గిస్తూ పథకాన్ని నీరుగార్చుతుందన్నారు.బడ్జెట్‌లో అధికంగా నిధులను కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనుల్లో కొలతలో సంబంధం లేకుండా కూలీలకు రోజుకు రూ.700లు చెల్లించాలని,వారానికి ఒకసారి మస్టర్ పే స్లిప్పులను కూలీలకు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, వారానికోసారి వేతనాలను చెల్లించాలని రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం కూలీలకు పది లక్షల ప్రమాద బీమాను కల్పించాలని, ప్రమాదంలో చనిపోయిన కూలీల కుటుంబాలకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియ చెల్లించాలని ఆయన అన్నారు.జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రెండువందల రోజుల పనిదినాలను కల్పించాలని రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. నరేంద్రమోదీ ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని రద్దు చేయకుండా బడ్జెట్‌లో అధిక నిధుల కేటాయించే విధంగా కూలీలంతా పోరాడాలన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటి సభ్యులు ఈ.రమేష్,కిషోర్,దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## 108సిబ్బందికి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు



108 సిబ్బందికి అవార్డులు అందజేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్22: బోధన్‌లో 108లో విధులు నిర్వహిస్తున్న ఈఎంటీ లక్ష్మణ్, పైలెట్ జావీద్‌లకు సోమవారం హైదరాబాద్‌లో 108జీవీకే ఈఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉత్తమ సేవ అవార్డులను సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108అత్యవసర సమయాల్లో ఆపదలో ప్రాణాలు కాపాడుతుందని, 108లో విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో 108జీవీకే ఈఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్, సీఈవో డాక్టర్ వెంకటేష్, ఖలీద్, రవికుమార్, 108 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

నవీపేట,ఏప్రిల్22: మండల కేంద్రంలో సోమవారం బాధిత కుటుంబాలను బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా పరామర్శించారు. మండల కేంద్రంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఉపాధి కూలీ ర్యాగళ్ల లావణ్య కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అలాగే ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అడెపు కిష్టబాయి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నర్సింగ రావు, తెడ్డు పోశెట్టి, మల్లేష్, సూరిబాబు, జావీద్ తదితరులున్నారు.

## ఉపాధి కూలీలకు 200 రోజుల పని కల్పించాలి

ఏర్గట్ల, ఏప్రిల్ 22: ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు ఉన్న ప్రతీ ఒక్క కూలీకి 200 రోజుల పని కల్పించాలని అఖిల బారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జికిషన్, సీపిఎం మాస్‌లైన్ ప్రజాపంత ఆర్మూర్ డివిజన్ నాయకులు బి అశోక్ తెలిపారు. సోమవారం మండలంలోని తాళ్ళరాంపూర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీల సమస్యలను తెలుసుకొని మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న రూ.300 రూపాయలు కాకుండా రోజు వారీ కూలీ ప్రతీ మనిషికి రూ.600 చెల్లించాలన్నారు. ప్రతీ కూలీకి భీమా సౌకర్యం, రూ.5లక్షల ప్రమాధ భీమా, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు రూ.20వేల జీతం పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో సీతక్క, లక్ష్మీ, జమున, శీను తదితరులు పాల్గొన్నారు.

## నేడు పంటల సాగుపై శాస్త్రవేత్తల సూచనలు

డిచ్‌పల్లి ఏప్రిల్ 22: మండలంలోని మెంట్రాజ్‌పల్లి రైతు వేదికలో మంగళవారం ఉదయం 9గంటలకు రైతులకు వరి పంటలో నేరుగా వెదచల్లే పద్ధతి మామిడి సాగులో నాణ్యత గుర్తింపు కు పాటించాల్సిన సూచనాలను, అంశాలను హైదరాబాద్ నుంచి సైంటిస్ట్‌లు వీడియా కాన్పరెన్స్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రైతులు హాజరుకావాలని మండల వ్యవసాయ అధికారి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయంలో నూతన పంటల సాగు కోసం శాస్త్రవేత్తల సలహాలు, రైతులకు అడగాలన్నారు.

## మోకన్‌పల్లిలో పిడుగు పడి ఆవు మృతి

నవీపేట,ఏప్రిల్22: మండలంలోని మోకన్‌పల్లిలో సోమవారం సాయంత్రం పిడుగుపడి ఆవు మృతి చెందింది. స్థానిక మిర్యాల ఒడ్డెన్న అనే రైతుకు చెందిన ఆవు అంజుమాన్ ఫారం చెరువు కట్ట వద్ద మేత మేస్తుండగా పిడుగు పడడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందిందని స్థానికులు తెలిపారు. ఆవు మృతితో రైతుకు సుమారు రూ.50వేల నష్టం జరిగిందని, ప్రభుత్వం బాధిత రైతును ఆదుకోవాలనిస్థానికులు కోరారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎడపల్లి, ఏప్రిల్ 22: ఎడపల్లి మండలంలోని అలీసాగర్ లిఫ్ట్ సమీపంలో బోదన్-నిజామాబాద్ ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు మహిళలకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోధన్ నుంచి నిజామాబాద్ వైపు ఆక్టీవా వాహంపై ఇద్దరు మహిళలు వెలుతుండగా ఎదురుగా వచ్చిన ఆటో డీ కొనడంతో వారికి తీవ్ర గాయాలు అయ్యాయి. సంఘటనను చూసిన వాహనదారులు అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో.. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిలా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళలు


ధ్వజస్తంభ ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

## అయ్యప్ప ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

సదాశివనగర్, ఏప్రిల్ 22: మండలకేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి జీవిత కాలంలో కొంత సమయాన్ని భగవంతుని సేవలో గడపడానికి కృషి చేయాలన్నారు. మనసు ప్రశాంతత భాదలను తొలగించే సంతోషపరిచే స్థలం దేవాలయాలు మాత్రమేనని అన్నారు. జాతీయ రహదారికి ఆనుకొని సుందరమైన అయ్యప్ప ఆలయం నిర్మిస్తున్న బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ పూర్తికోసం దాతలు ధర్మకర్తలు మరింత ఉత్సాహంతో విరాళాలు అందజేస్తు ఆలయం పూర్తి నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కమలాకర్‌రావు, మాజీ సర్పంచ్ గంగారెడ్డి, మహిపాల్‌రెడ్డి, తలారి బాలరాజు, గురుస్వాములు వీరయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.


రైతులతో కలిసి పోస్టుకార్డులను సీఎంకు పంపుతున్న మాజీ ఎమ్మెల్యే

## రైతులకు క్వింటాలుకు బోనస్ చెల్లించాలి : మాజీ ఎమ్మెల్యే

రామారెడ్డి, ఏప్రిల్ 22: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తామని హామీ ఇచ్చి అమలుచేయడం లేదని విమర్శించారు. అనంతరం రైతుల బాధలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ వెంటనే చేపట్టాలని, రైతులకు గోనె సంచులు ఇవ్వలేని ప్రభుత్వం వెంటనే అందేలా చూడాలని అన్నారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రైతులకు రూ.500 బోనస్‌ని సైతం అందించాలని రైతులతో కలిసి పోస్టుకార్డులను రాష్ట్రప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామారెడ్డి ఎంపీపీ దశరథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రంగు రవీందర్‌గౌడ్, సదాశివనగర్ మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి,మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రావు, మండల నాయకులు నారాయణరెడ్డి, కాసర్ల రాజేందర్, మాజీ సర్పంచ్‌లు దండబోయిన సంజీవ్, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, రాజనర్సు, గంగాధర్, మల్లేష్, ఎంపీటీసీలు రజితరాజేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



హస్గుల్ అంగన్‌వాడీ స్కూల్‌డే నిర్వహిస్తున్న దృశ్యం

## 'అంగన్‌వాడీల ద్వారానే పౌష్టికాహారం'

బిచ్కుంద, ఏప్రిల్ 22: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందుతుందని ఐసీడీఎస్ సీడీపీవో సునంద అన్నారు. సోమవారం మండలంలోని హస్గుల్ గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో అంగన్‌వాడీ స్కూల్‌డే కార్యక్రమాన్ని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆమె మాట్లాడుతూ గర్భిణీ,బాలింతలకు ఆరోగ్య పౌష్టికాహారం అందడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లల ఎదుగుదలను నిర్వాహకులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటిస్తారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కొమురవ్వ, అంగన్‌వాడీ టీచర్ సిబ్బంది పిల్లల తల్లులు గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు

## 'హెచ్‌ఎం సస్పెన్షన్ సమంజసం కాదు'

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 22: కరీంనగర్ జిల్లా తిమ్మపూర్‌కు చెందిన తెలంగాణ స్టేట్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాష్‌ను సస్పెన్షన్ చేయడం సమాంజసం కాదని జిల్లా అధ్యక్షుడు నీలం లింగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని కొందరు ఉపాధ్యాయులకు సంబంధించిన రికవరీ చేసిన వేతనాలు ట్రెజరీకి చలనా రూపంలో జమ చేయడంలో నాన్ టీచింగ్ స్టాప్ సిబ్బంది చేసిన పొరపాట్లకు, ఆ పోరపాట్లను గుర్తించి ప్రధానోపాధ్యాయుడు ముందుస్తు చర్యగా శాఖపరమైన చర్యలు చేపట్టి పైఅధికారులకు నివేదిక రూపంలో సమాచారం అందించారని, ఆ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతున్నామన్నారు.



# జిల్లాలో పలుచోట్ల మోస్తారు వర్షం

● పెద్దకొడప్‌గల్, జుక్కల్ మండలాల్లో అతలాకుతలం ● ఈదురుగాలులకు నేలకూలిన చెట్లు ● దోమకొండలో కొబ్బరిచెట్టుపై పిడుగుపాటు ● గ్రామాల్లో తడిసి ముద్దయిన ధాన్యం

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 22: జిల్లాలోని ఆయా మండలాల్లో సోమవారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. దీనిలో భాగంగా జిల్లా కేంద్రంలో వర్షం కురువగా ఆయా మండలాల్లో దాదాపు గంట పాటు వర్షం పడింది. జిల్లాలోని బిచ్కుంద, పిట్లం, బీర్కూర్, బీబీపేట, తదితర మండలాల్లో రైతులు ఆరాబెట్టిన ధాన్యం తడిసిపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ ఉండడంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం ఆరబోశారు. కాగా సాయంత్రం వేళ అకస్మాత్తుగా వర్షం కురువడంతో ఆరబెట్టిన ధాన్యాన్ని ఒకదగ్గరకు చేర్చేందుకు ఇబ్బందులు పడడంతో పాటు ధాన్యం తడిసిపోవడంతో నానా అవస్థలు ఎదుర్కొన్నారు.

### ● గాలులకు ఎగిరిపోయిన రేకుల షెడ్లు

**పెద్దకొడప్‌గల్:** పెద్దకొడప్‌గల్, జుక్కల్ మండలాల్లో సోమవారం కురిసిన అకాల వర్షం అతలాకుతలం చేసింది, సాయంత్రం బలమైన ఈదురు గాలులతో వీయడంతో రహదారి వెంబడి గల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయిన. అనంతరం భారీగా వర్షం కురవడంతో రైతన్నలు ఆరబెట్టిన వడ్లు, జొన్నలు, మొక్కజొన్నలు వర్షానికి నీటిలో మునిగిపోయాయి. బలమైన గాలులు వీయడంతో రేకుల షెడ్లు కూలిపోయాయి. అంతేకాకుండా జుక్కల్, పెద్దకొడప్‌గల్ మండలాల్లో ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉరుములు, మెరుపులు భారీగా శబ్ధం రావడంతో ప్రజలు ఆందోళన చెందారు. ముఖ్యంగా వ్యవసాయదారులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

### ● దోమకొండలో పిడుగుపాటు

**దోమకొండ:** మండలంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, గాలులతో మోస్తారు వర్షం కురిసింది. మండల కేంద్రంలోని బీబీపేట రోడ్డులోని రామాచారి ఇంట్లో ఉన్న కొబ్బరిచెట్టుపై పిడుగుపడి చెట్టు మంటలతో పూర్తిగా కాలిపోయింది. పిడుగు పడిన సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదు. మండల వస్తున్న విషయాన్ని స్థానికులు విద్యుత్ అధికారులకు తెలుపడంతో ఏఈ ప్రదీప్ కుమార్ అప్రమత్తమై వెంటనే విద్యుత్‌ను నిలిపివేయించారు.ఏడీఈ కిరణ్ చైతన్య తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని విద్యుత్ మరమ్మతులను పరిశీలించారు.ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా విద్యుత్ సప్లై అందించారు. పిడుగు పడిందన్న విషయం వాట్సప్ గ్రూప్‌ల్లో రావడంతో గ్రామస్తులు అక్కడికి పెద్దఎత్తున చేరుకున్నారు.


జిల్లాకేంద్రంలో జోరుగా కురుస్తున్న వర్షం


బీబీపేటలో కురుస్తున్న వర్షం ఇలా..

### ● రైతులను పరుగులు పెట్టించిన గాలులు

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన వరిధాన్యంను రైతులు రాశులుచేసి తార్పాలిన్‌లను కప్పి పెట్టారు. అయితే సోమవారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు, భారీగా గాలులు విచడంతో ధాన్యం రాశులపైన కప్పిన తార్పాలిన్‌లు కొట్టుకుపోయాయి. తార్పాలిన్‌ల పై రాళ్ల పెట్టిన ఆగకుండా కవర్‌లు లేవడంతో రైతులు పరుగులు పెట్టారు. కొట్టుకుపోయిన తార్పాలిన్‌లను తిరిగి ధాన్యం రాశులపై కప్పేందుకు రైతులు పడరాని పాట్లు పడ్డారు. ఒకపక్క వర్షం, మరోపక్క గాలులు వియడంతో రైతులు గంట పాటు తిప్పలుపడి రాశులపై తార్పాలిన్ కప్పి పెన రాళ్లు, ఇతర బరువులు పెట్టి ఊపరి పీల్చుకున్నారు.

### ● అకాలవర్షంతో తడిసిన ధాన్యం

**బిచ్కుంద:** మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టగా.. 20 నిమిషాల అకాల వర్షంతో పూర్తిగా వడ్లు నీటిలో మునిగిపోయాయి. అంతేకాకుండా వర్షం తగ్గగానే ధాన్యం కింద నీటిని తొలగించేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విపరీతమైన ఎండలు ఉండగా.. సాయంత్రం నిమిషాల వ్యవధిలోనే వాతావరణం మార్పు ఏర్పడి వర్షం రావడంతో రైతులు దిక్కులేనిస్థితిలో ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తేమశాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


బిచ్కుంద మార్కెట్ యార్డులో నీటమునిగిన ధాన్యం


దోమకొండలో కొబ్బరిచెట్టుపై పిడుగుపాటుకు చెలరేగిన మంటలు


పెద్దకొడప్‌గల్‌లో కురుస్తున్న భారీ వర్షం


బలమైన ఈదురుగాలులకు కూలిపోయిన షెడ్డు

# రైతులను మోసగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

● మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

దోమకొండ, ఏప్రిల్ 22: కల్లబొల్లి మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తూనే ఉందని మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. దోమకొండ మండలం అంచనూర్‌లో సోమవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటల్ వరిధాన్యానికి రూ. 500 బోనాస్ ఇస్తామని చెప్పినప్పటికీ అమలు చేయలేక పోయిందన్నారు. ఇప్పటికీ సగం మంది రైతులకు కుడా రైతుబంధు అందించలేకపోయిందన్నారు. సీజన్‌కు అనుకూలంగా రైతులకు రైతుబంధు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రూ. 500 బోనాస్ తప్పనిసరిగా ఇవ్వల్సిందేనని డిమాండ్ చేశారు. వాతవారణ మార్పులతో వర్షాలు పడుతున్నందున తడిసిన ధాన్యాన్ని సైతం కచ్చితంగా కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గంద్ర మధుసుదన్‌రావు, సీడీసీ మాజీ చైర్మన్ ఐరేని నర్సయ్య, సంజీవరెడ్డి, దోర్నల లక్ష్మణ్, నరేష్, పాలకుర్తి శేఖర్, నల్లపు శ్రీనివాస్, గజవాడ శ్రీకాంత్, బుర్రి రవి కుమార్,నారాగౌడ్, కిషన్‌రెడ్డి, గంగాధర్, రైతులు,తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అంచనూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు భీమరి రాంలు మరణించగా బాధిత కుటుంబాన్ని సోమవారం మాజీ ప్రభుత్వవిప్ గంప గోవర్ధన్ పరామర్శించారు. మృతుని భార్య నర్సవ్వ కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి పార్టీ అండంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అంచనూర్‌లో మాట్లాడుతున్న గంప గోవర్ధన్

## గజ్జెలమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

బీర్కూర్, ఏప్రిల్ 22: బీర్కూర్ మండల కేంద్రంలో గజ్జెలమ్మ అమ్మవారిని కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రతియేటా హనుమాన్ జయంతి సందర్భంగా గజ్జెలమ్మ జాతర నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. ఈ జాతర ఉత్సవాలు మూడు రోజులుగా కొనసాగుతాయి. మంగళవారం నుంచి జాతర ప్రారంభం కానుందని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చందు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శంకర్, కమలాకర్‌రెడ్డి, యామ రాములు, సుధాకర్‌గౌడ్, క్యాకప్ప, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల జయంతి ఉత్సవ కరపత్రాల ఆవిష్కరణ

నిజాంసాగర్, ఏప్రిల్ 22: మహనీయుల జయంతి ఉత్సవాలను ఈ నెల 30న పిట్లం మండల కేంద్రంలో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను జుక్కల్ శాసన సభ్యులు తోట లక్ష్మీకాంత్ రావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. మహనీయుల జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గైని విఠల్, బాల్‌రాజ్, రమేష్, సాయిలు, తదితరులున్నారు. అలాగే మహనీయుల జయంతి ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండేను కలిసి ఆహ్వానించారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు.

## వేంకటేశ్వర ఆలయంలో ఉత్సవాలు ప్రారంభం

భిక్కనూరు, ఏప్రిల్ 22: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న జీర్ణోద్ధరణ ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొదటి రోజు ఉదయం స్వామివారిని అందంగా అలంకరించి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విష్వక్సేన ఆరాధన, వాసేదేవ పుణ్యాహవచనము, రక్షాబంధనము, ముత్సం గహణము, యాగశాల ప్రవేశము, అగ్నిప్రతిష్ఠ, మంటపరాధన, ఆదివాస హక్షములు, మూలమంత్ర హవనము, దేవాతాహ్వానము, తీర్థప్రసాదాల వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా శివ పార్వతుల కల్యాణ వేడుకలు

నిజాంసాగర్, ఏప్రిల్ 22: మండలంలోని గోర్గల్ గ్రామంలో సోమవారం శివ పార్వతుల కళ్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సప్తహ కార్యక్రమంలో బాగంగా ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి దుర్గారెడ్డి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు బ్యాండు మేళాలతో ఆలయం వద్దకు తీసుకుని వచ్చి కళ్యాణ వేడుకలను కమనీయంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## బీజేపీ గ్రామ బూత్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 22: మండలంలోని వెంకటాపూర్ గ్రామ బూత్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు తెలిపారు. గ్రామ బూత్ అధ్యక్షునిగా శ్యామ్, యూత్ అధ్యక్షుడిగా ప్రకాష్, బూత్ కమిటీ సభ్యులు మహేందర్, చంద్రపాల్, నవీన్, సిస్టం సతీష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

## జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 22: పెద్ద కొడప్‌గల్ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం జొన్నగోలు కేంద్రాన్ని సహకార సంఘం క్లస్టర్ ఇన్‌చార్జి లక్ష్మినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మినారాయణ మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతన్నలు పండించిన జొన్నపంటను దళారుల పాలు కాకుండ ఉండేందుకు గాను ప్రభుత్వం జొన్న కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేసిందని తెలిపారు. రైతన్నలు తాము పండించిన పంటను దళారులకు అమ్మకుండ కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకోవాలని సూచించారు, జొన్నకు ప్రభుత్వం క్వింటా మద్దతు ధర 3185 లుగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు, ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నదీం, సహకార సంఘం సిఈవో సందీప్, ఏఈవోలు రూప తదితరులు పాల్గొన్నారు,

## నిప్పంటుకుని రైతు మృతి

బీర్కూర్, ఏప్రిల్ 22: మండల కేంద్రానికి చెందిన అరిగే రాములు (65) అనే రైతు ఆదివారం తన పొలంలో కొయ్యకాళ్లకు నిప్పు పెట్టాడు. ఒంటికి నిప్పు అంటుకుని రాములు పొలంలోనే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్‌కు చెందిన అరిగే రాములుకు గ్రామ శివారులో ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. తన భూమిని గ్రామానికి చెందిన ఒక రైతుకు కౌలుకు ఇచ్చాడు. ఇటీవల పంట కోసేశారు. ఇదిలా ఉండగా రాములు ఆదివారం తన పొలం వద్దకు వెళ్లాడు. కొయ్యకాళ్ళకు నిప్పు పెట్టాడు. గాలి విపరీతంగా వీయడంతో పొగ కమ్ముకుంది. పొగలో ఊపిరి ఆడక రాములు సృహ తప్పి పొలంలోనే పడిపోయాడు. మంటలు వ్యాపించి రాములు ఒంటికి నిప్పు అంటుకుని రాములు మృతి చెందాడు. రాత్రి వేళలో మృతుడికి కుటుంబ సభ్యులు పొలానికి వచ్చి చూడగా రాములు కాలిన గాయాలతో మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## పుస్తెమట్టెల అందజేత

భిక్కనూరు, ఏప్రిల్ 22: మండలంలోని గుర్జకుంట గ్రామానికి చెందిన పాడిరైతు బద్దం దుర్గారెడ్డి కూతురు వివాహానికి కరీంనగర్ డెయిరీ సిబ్బంది కల్యాణ మండపంలో పుస్తెమట్టెలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ డెయిరీ కామారెడ్డి బ్రాంచ్ మేనేజర్ సాయికుమార్ మాట్లాడుతూ.. కరీంనగర్ డెయిరీలో పాలు పోసే పాడి రైతుల కూతురు వివాహానికి పుస్తేమట్టెలను అందజేయ్యడం జరుగు తుందన్నారు. కరీంనగర్ డెయిరీలో పాడిరైతులు పాలు పోసి డెయిరీ నుంచి అందజేస్తున్న ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలకేంద్రం అధ్యక్షుడు బియ్యం భిక్షపతి, అసిస్టెంట్ మేనేజర్ రాజాగౌడ్, సూపర్‌వైజర్ అశోక్, డైరెక్టర్లు నరేస్, రమేష్ ప్రతాప్‌రెడ్డి, పాడి రైతులు పాల్గొన్నారు.

## 'నిరుద్యోగుల ఉపాధి కల్పనకు కృషి'

మద్నూర్, ఏప్రిల్ 22: జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తనవంతు సహాయ, సహకారాలు కల్పించడంతో పాటు జుక్కల్ నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఏర్పాటు చేసి తనవంతు కృషిచేస్తానని జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం మద్నూర్ మండల కేంద్రంలో రోడ్ షో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, మాజీ సర్పంచ్ దరాస్ సురేష్, హన్మాండ్లు మేస్త్రి తదితరులున్నారు.

## 'ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి'

భిక్కనూరు, ఏప్రిల్ 22: ప్రతిఒక్కరు ప్లాస్టిక్ వినియోగం తగ్గించి ధరిత్రిని ప్లాస్టిక్ నుండి కాపాడాలని మండలంలోని బీటాఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ అన్నారు. సోమవారం సౌత్‌క్యాంపస్‌లో ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించి ప్లాస్టిక్ తగ్గించి భూమిని, పర్యావరణాన్ని కాపాడుతామని విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కారణంగా జరిగే అనార్థాలను వివరించారు. ప్రతిఒక్కరు ప్లాస్టిక్ తగ్గించి మొక్కలను పెద్దఎత్తున పెంచాలని సూచించారు. ప్లాస్టిక్ రహిత ప్రపంచంగా మార్చే కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం క్యాంపస్ ఆవరణలో మొక్కలు నాటారు. ఇందులో ఏపీఆర్వో సరిత, అధ్యాపకులు హరిత, లక్మరాజు, మోహన్‌బాబు, ప్రతిజ్ఞ, నారాయణ, యాలాద్రి, శ్రీమాత, దిలీప్, ఇంద్రకరణ్, కనకయ్య, సునీల్, శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


● భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో మొక్కలు నాటుతున్న దృశ్యం

## సినిమా గైడ్ కామారెడ్డి



**కామారెడ్డి**

| | |
|---|---|
| దర్శన్ | - మనజుమిల్ బాయ్స్ |
| శాంతి | - టిల్లు స్క్వేర్ |
| ప్రియా 70 | - ది ఫ్యామిలీ స్టార్ |
| ప్రియా 35 | - గీతాంజలి మళ్లీ వచ్చింది |

**బాన్సువాడ**

| | |
|---|---|
| మహేశ్వరి | - టిల్లు స్క్వేర్ |
| వెంకటేశ్వర | - పారిజాత పర్వం |

## చికెన్ ధరలు



| రకం | : | లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|---|
| సుగుణ (కిలో) | : | 100 | 160 | 180 |
| వెన్‌కాబ్(కిలో) | : | 100 | 180 | 210 |

